ప్రజాశక్తి

గురువారం 20 ఏప్రిల్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

వేడిగాలుల్లో ఉపాధి కూలీలు

- పల్నాడు జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు
- గుంటూరు జిల్లాలో నిలిచిన నర్సరీలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వేసవి తీవ్రతతో గుంటూరు, ప్రకాశం జిల్లాలో ఉపాధి హామీ కూలీలు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటలకే వేసవి ప్రభావం కనిపిస్తోంది. ఉదయం 10 గంటలకే వేడిగాలులు పెరుగుతున్నాయి. ఎండ వేడి వల్ల పనుల్లో ఉన్న కూలీలు మాడిపోతున్నారు. పనులు జరిగే ప్రదేశాల్లో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. టెంట్లు వేయించాలని, ఉదయం 11 గంటల కల్లా పనులు ముగించి కూలీలను నీడ ప్రదేశానికి తీసుకువెళ్లాలని మార్గదర్శకాలు ఉన్నాయి. కొన్నిచోట్ల 11 గంటల తరువాత కూడా పనులు చేయిస్తున్నారు.

పల్నాడు జిల్లాలోని వివిధ మండలాల్లో 42 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఏడాది పల్నాడు జిల్లాలో ఉపాధి హామీ కింద 87,35,991 పని దినాలు కల్పించాలని నిర్ణయించగా గుంటూరు జిల్లాలో 30,85,104 పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించారు. ప్రస్తుతం ఎక్కువగా మట్టి పనులు చేయిస్తున్నారు. రహదారుల నిర్మాణం, కందకాలు తవ్వడం, కాల్వలను తవ్వడం, పూడికతీత, సాగునీటి పారుదలకు వీలుగా కాల్వగట్లను పటిష్టపర్చడం పనులు పల్నాడు జిల్లాలో ఎక్కువగా జరుగుతున్నాయి.

గుంటూరు జిల్లాలో పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉండటం వల్ల పనిదినాలు సంఖ్యను బాగా తగ్గించారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో గతంలో నర్సరీలు ఉన్నా ఇప్పుడు వాటినీ నిలిపివేశారు. అటవీ విస్తీర్ణమూ తక్కువగా

▶ 2లో

రెంటచింతలలో 50 డిగ్రీల ఉష్ణోగ్రత!

రెండు దశాబ్దాల తర్వాత భారీగా నమోదు

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలో బుధవారం భానుడు భగభగమన్నాడు. ఎన్నడూ లేని విధంగా బుధవారం 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణంగా మేలో రోహిణి కార్తె సందర్భాల్లో ఇలా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. అయితే ఏప్రిల్‌లోనే నిప్పుల కొలిమిలా కాచిన ఎండతో ఇక్కడి ప్రజలు అల్లాడారు. పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా పనులు చేసుకునే కార్మికులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాన్ను రోజుల్లో ఎండ ఇంకెంత తీవ్రంగా ఉంటుందోనని ఆందోళనకు గురవుతున్నారు. గతంలో 2002 మేలో 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ప్రచారభేరీ ర్యాలీలో వి.శ్రీనివాసరావు, పాశం రామారావు తదితరులు

మతోన్మాద బిజెపితో ముంచుకొస్తున్న ముప్పు

- వాడవాడలా సిపిఎం, సిపిఐ ప్రచార భేరి
- తాడేపల్లిలో ప్రచార భేరీని ప్రారంభించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

5 లో

క్వార్టర్ కోసం కొడుకును అమ్ముకున్న తండ్రి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నిందితుడు వసంతరావు

క్వార్టర్ మద్యం కోసం కన్న కొడుకునే తండ్రి అమ్మేసుకున్న ఘటన మండలంలోని కోయవారిపాలెంలో బుధవారం వెలుగు చూసింది. బిడ్డ తల్లి కొండమ్మ వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కేంద్రానికి చెందిన కొవరగిరి వసంతరావుకు పల్నాడు జిల్లా వినుకొండ ప్రాంతానికి చెందిన కొండమ్మకు కొన్నేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు బిడ్డలు. ఏలూరు నివాసం ఉండే వీరికి పనులు సరిగా లేకపోవడంతో తెలిసిన బంధువుల వద్దకు గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలోని కోయవారిపాలేనికి రెండు నెలల కిందట వచ్చారు. కొండమ్మ కూలి పనులకు వెళ్తుండా వసంతరావు తమ ఇద్దరు కుమారులును చూసుకుంటూ

▶ 2లో

సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్.. వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులు

నిధులెక్కువ.. ఇళ్లు తక్కువ..

- గృహనిర్మాణ పురోగతిపై మంత్రి అసంతృప్తి
- రూ.కోట్లు కుమ్మరించినా వేగం లేదన్న అజయ్ జైన్
- రోజుకు 128 ఇళ్లకు గాను 28 నిర్మాణం
- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులపై ఎమ్మెల్యేల పెదవి విరుపులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణంపై రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సమీక్షించారు. పురోగతిపై మంత్రితోపాటు గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులంతా భాగస్వామ్యం కావాలని కోరారు. గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రతిరోజూ 128 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం 28 మాత్రమే నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక అధికారులు, మండలస్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ నిత్యం పర్యవేక్షించాలన్నారు. లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ ఇళ్ల నిర్మాణాలను పరుగులు పెట్టించాలని చెప్పారు. అజయ్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న కాలనీలకు భూసేకరణ, మెరకలు, మౌలిక సదుపాయాలకు రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టగా ఇందులో గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లోనే రూ.8 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. కానీ ఈ జిల్లాల్లోనే పురోగతి తక్కువగా ఉందని, గుంటూరు జిల్లాలో 67,678 ఇళ్ల నిర్మాణాలను మంజూరు చేయగా 8025 మాత్రమే పూర్తయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరానికి దూరంగా ఉన్న లే అవుట్లకు రానున్న రోజుల్లో మంచి రవాణా సౌకర్యాలు

▶ 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సాయంత్రం) : 6.29

సహారీ (శుక్రవారం ఉదయం) : 4.31

జిజిహెచ్‌లో నేరాల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నేరాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకొనే విధంగా ఆస్పత్రి పరిసర ప్రాంతాలలోనూ పార్కింగ్ ప్రదేశాలలోనూ సిసి కెమెరాలు పక్కాగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ బుధవారం అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో భద్రతపై బుధవారం ఆయన సమీక్షించారు. ఆసుపత్రి వద్ద సెక్యూరిటీ సిబ్బందిని పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. చాలా మంది ప్రజలు వివిధ ప్రాంతాల నుండి అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. రాంగ్ పార్కింగ్ పెట్టకుండా విధిగా పార్కింగ్ చేసుకోవాలన్నారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి శ్రీనివాస రావు, ఈస్ట్ డిఎస్పి సీతారామయ్య, కొత్తపేట సీఐ శ్రీనివాసులు రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరసింహారావు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది,ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ కడియాల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-నరసరావుపేట

నరసరావుపేట టిడిపి సీనియర్ నాయకులు, టిడిపి డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ప్రకాష్ నగర్‌లో ఉన్న పల్నాడు జిల్లా టిడిపి కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. నియోజకవర్గ లోని ముస్లిం సోదరులతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు, మహిళా నాయకులు తమ ఆతిధ్యం స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

మే కల్లా 5 లక్షల ఇళ్లుపూర్తి

గుంటూరులో మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో జగనన్నకాలనీల్లో నిర్మాణంలో ఉన్న 5లక్షల ఇళ్లను మే నెల చివరికి పూర్తి చేస్తామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. గృహ నిర్మాణంపై గుంటూరులో బుధవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ చరిత్రలో ఒకే సారి 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించేందుకు సిఎం జగన్ తీసుకున్న నిర్ణయం గిన్నిస్ బుక్‌లోకి ఎక్కిందన్నారు. మొదటి, రెండు దశల్లో 21 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టగా వీటిల్లో ఐదు లక్షల ఇళ్లు నిర్మాణం పూర్తికావడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. పేదల స్వంత ఇంటి కలను నిజం చేస్తూ వారిని స్వంత ఇంటిలో గృహ ప్రవేశం చేయించేందుకు త్వరలో భారీ కార్యక్రమం రూపకల్పన చేస్తామన్నారు. టిడ్కో ఇళ్లు ఎప్పటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తారన్న అంశంపై సమాధానం దాటవేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ మంత్రి హరీష్‌రావు వంటి వ్యక్తులకు కన్పించడం లేదని ఒక సారి రాష్ట్రానికి వస్తే తమ అభివృద్ధి చూపిస్తామన్నారు. గ్రామ వార్డు సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, ఆర్‌బికేలు, వెలనెస్‌సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రతి మండలానికి రెండు పిహెచ్‌సిలు ఏ రాష్ట్రంలోనైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. 175 స్థానాలను గెలుస్తామని చెబుతున్న చంద్రబాబు తొలుత అన్ని స్థానాల్లో టిడిపి అభ్యర్థులను పోటీకి పెట్టాలని సవాల్ విసిరారు. రాష్ట్రానికి ఖర్మపట్టలేదని, చంద్రబాబు వల్లే ఆ పార్టీకి కర్మ పట్టిందన్నారు. లోకేష్ చేసేది పాదయాత్ర కాదు 'పాకుడు యాత్ర' అని ఎద్దేవా చేశారు.

కార్మికురాలు విమలను వెంటనే పనిలోకి తీసుకోవాలి

ఎర్రబాలెంలో రాజధాని కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

గుంటూరు కార్పొరేషన్‌లో అకారణంగా పని నుండి తొలగించారనే ఆందోళనతో ఆత్మహత్యాయత్నం చేసిన కార్మికురాలు విమలను వెంటనే పనిలోకి తీసుకోవాలని కోరుతూ రాజధాని గ్రామమైన ఎర్రబాలెంలో బుధవారం పని విరామ సమయంలో రాజధాని కార్మికులు నిరసన తెలిపారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ లోని హనుమయ్య నగర్‌లో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న విమల అనే కార్మికురాలనీ స్థానిక కార్పొరేటర్, మేయర్ విధుల నుండి అకారణంగా తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. పని నుండి తొలగించిన కార్మికురాలు విమలను వెంటనే పనిలోకి తీసుకోవాలని, విమల ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కల్పించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. కార్మికురాలు విమలను వెంటనే పనిలోకి తీసుకొని పని భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబు, శివకోటి, ఆదిలక్ష్మి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆసాంతం ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

రెండో రోజు పోటీలను ప్రారంభిస్తున్న లక్కరాజు పద్మిని

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండలంలోని వరగానిలో లావు వెంకటేశ్వర్లు కల్లూరు నాగేశ్వరావు కళాపరిషత్ వారి నాటక పోటీలను రోటరీ పాల్ హారిస్ కళా ప్రాంగణంలో బుధవారం రెండవ రోజు జిఎంఎల్ రోటరీ పత్రిక ఎడిటర్ లక్కరాజు పద్మిని ప్రారంభించారు. ముందుగా అక్షయ విద్యాలయం విద్యార్థులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. మొదటి ప్రదర్శన కొత్తపరిమళం, రెండవ ప్రదర్శన స్వర్ణకమలం, మూడో ప్రదర్శన నాన్నా నేను వచ్చేస్తా నాటికలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా లక్కరాజు పద్మినీని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అన్నే రత్న ప్రభాకర్, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, ఎస్ రాంప్రసాద్ , కళాపరిషత్ నిర్వాహకులు ముద్దన రాఘవయ్య , పోపూరి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు పాల్గొన్నారు.

వేడిగాలుల్లో ఉపాధి కూలీలు

(మొదటి పేజీ తరువాయి)

ఉండటంతో ఇటీవల జిల్లా సామాజిక అటవీశాఖ విభాగాన్ని కూడా ఎత్తివేయడంతో మొక్కల పెంపకం నిలిచింది. గతంలో ఉపాధి హామీ కింద మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణ కీలకంగా ఉండేది. గతేడాది మొక్కల కొనుగోలు, నిర్వహణ, సంరక్షణకు నిధుల ఇవ్వకపోవడం వల్ల నామమాత్రంగానే పెంపకం, పంపిణీ జరిగింది. ఈ ఏడాది పనిదినాల లక్ష్యంలో కూడా మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. ఉపాధి హామీ నిధులతో గతంలో సామాజిక అటవీశాఖ విభాగం ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చేవారు. అటవీశాఖ సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో నర్సరీల నుంచి మొక్కల సరఫరాకు నిర్వహకులు ముందుకు రావడం లేదు. ఉపాధి హామీ నిధులతో బయట నుంచి మొక్కలు కొనుగోలు చేసి నాటడానికి ప్రభుత్వం అనుమతివ్వడం లేదు. ఉపాధి హామీ సిబ్బంది కూడా నర్సరీలు సొంతంగా ఏర్పాటు చేసేందుకు అవకాశాలు లేవు. వారికి తగిన వసతులు లేవు. మొక్కల పంపిణీ లేకపోవడం వల్ల చాలా మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గాయి. పట్టణ ప్రాంతాల్లో మున్సిపాల్టీల పరిధిలోని ఉద్యాన శాఖ విభాగాలు ప్రైవేటు నర్సరీల నుంచి నేరుగా మొక్కలు కొనుగోలు చేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో సామాజిక అటవీశాఖ కొనసాగుతోంది. దీంతో పల్నాడు జిల్లాలో కొంత మేరకు మొక్కలను పెంచుతున్నారు.

మాట్లాడుతున్న సినీ నటుడు ఆలీ

షాదీఖానా అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నరసరావుపేట:పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో గల షాదీఖానాలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముస్లిం సోదరులకు, ప్రజలకు, వైసిపి శ్రేణులకు బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ,ముఖ్య అతిధిలుగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, వైసిపి సినీ ఆటోగ్రఫీ కార్పొరేషన్ చైర్మన్ నటుడు ఆలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసరావుపేట విచ్చేసిన ఆలీకి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు ముస్లిం మైనారిటీ సోదరులు ఘనంగా స్వాగతం పలికారు. షాదీఖానా ఆధునీకరణలో భాగంగా రూ.21 లక్షలతో శంకుస్థాపన చేశారు.ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నటుడు ఆలీ మాట్లాడుతూ పార్టీకి తాను చేసిన సేవలు గుర్తించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సినిమా ఆటోగ్రఫీ కార్పొరేషన్ చైర్మన్ నియమించడం పట్లసంతోషంగా ఉందన్నారు.ప్రతి వ్యక్తిలో ఒక కళ దాగి ఉంటుందని తప్పనిసరిగా ఏదో ఒక సమయంలో అది బయటపడుతుందని అన్నారు. తాను 15 ఏళ్ల వయసులో ఉండగా పలు మార్లు నరసరావుపేట వచ్చానని నేటికి షుమారు 40 ఏళ్ల అనంతరం రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందుకు రావడం ముస్లిం సోదరులను కలవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం మంత్రి జోగి రమేష్ ముఖ్య నాయకులు ప్రసంగించారు.

క్వార్టర్ కోసం కొడుకును అమ్ముకున్న తండ్రి

(మొదటి పేజీ తరువాయి)

ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట కొండమ్మ పనికి వెళ్లి వచ్చే సరికి వసంతరావు, ఏడాదిన్నర వయస్సున్న తన చిన్న కుమారుడు ఏసురాజు కనిపించలేదు. అప్పటి నుండి వారి కోసం వెదుకులాడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వసంతరావు మద్యం తాగి తూగుతూ ఇంటికి ఒక్కడే వచ్చాడు. పిల్లవాడు ఏడి.. అని భార్య కొండమ్మ ప్రశ్నించగా తనకు తెలిసిన వారికి అమ్మేశాని వసంతరావు సమాధానమిచ్చాడు. దీంతో ఆమె ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించారు. మద్యం కోసం తన భర్త తన బిడ్డనే అమ్ముకున్నారని వాపోయారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

నిధులెక్కువ.. ఇళ్లు తక్కువ..

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులోకి రావటంతో పాటు పట్టణాల్లో కలిసి పోతాయని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదార్లు ముందుకు రావాలని కోరారు.

సున్నావడ్డీతో రూ.4 లక్షలు రుణాలివ్వాలి : ఎమ్మెల్సీ కెఎస్

ఎమ్మెల్యే కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రూ.1.80 లక్షలు, డ్వాక్రా సంఘం ద్వారా అందించే బ్యాంకు రుణం రూ.35,000 సరిపోవని, నిర్మాణాలు వేగవంతం కావాలంటే జాతీయ బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు కనీసం రూ.2-3 లక్షలను సున్నావడ్డీకి ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. పేరేచర్ల లేఅవుట్ గుంటూరుకు 16 కిలో మీటర్ల దూరంలో ఉందని, గుంటూరులో నివసిస్తూ రోజువారి పనులు చేసుకునే వారు అంతదూరం వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని చెప్పారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్థానికి ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యంతోనే ఇళ్ల నిర్మాణం వేగవంతం అవుతుందన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే వారికి స్వచ్ఛంద సేవాసంస్థలు, వ్యాపార సంస్థల సిఎస్ఆర్ ద్వారా ఆర్థిక సాయం అందించే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పేరేచర్ల లే అవుట్‌కు పక్కాగా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, కొర్నెపాడు లే అవుట్‌లో లెవలింగ్ పూర్తి చేసి లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని కోరారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పొన్నూరు పట్టణంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, పెదకాకాని మండలంలో వారికి సిఆర్‌డిఎ పరిధిలో కేటాయించే స్థలాల్లో ఇళ్లు అప్షన్ 3 క్రింద ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు. నారాకోడూరులో ఇళ్ల స్థలాలకు సేకరించిన భూమిపై కోర్టులో ఉన్న కేసును పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నబత్తుని శివకుమార్ మాట్లాడుతూ డిఆర్‌డిఎ, మెప్మా ద్వారా డ్వాక్రా సంఘాల్లోని లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా అందించే రుణాలను అప్షన్ 3లో ఇళ్లు నిర్మిస్తున్న ఏజెన్సీలకు ప్రారంభ దశలోనే అందించాలని సూచించారు. గుంటూరు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ నగరంలోని లబ్ధిదారులకు సమీపంలోని గ్రామాల్లో ఐదు లేఅవుట్లలో ఇంటి స్థలాలు ఇచ్చారని, లే అవుట్లలో పూర్తి స్థాయిలో మౌలిక సౌకర్యాలు, ఇతర వసతులు కల్పించటానికి ప్రత్యేకంగా నగరపాలక సంస్థకు నిధులు కేటాయించాలని కోరారు.

అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను మండలస్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు లే అవుట్‌లలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, చిన్న సమస్యలుంటే వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణానికి నిధుల సమస్య లేదని, ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా నగదు ఎప్పటికప్పుడు జమ చేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 67,678 ఇళ్ల నిర్మాణాలను మంజూరు చేయగా ఇప్పటి వరకు 8025 పూర్తయ్యాయని, 34256 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో శాసనమండలిలో చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జెసి జి.రాజకుమారి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడీ సాయినాథ కుమార్, ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

అధికారులకు మంత్రి జోగిరమేష్ ఆదేశం

ప్రజాశక్తి- నరసరావుపేట

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం నరసరావు పేట కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శివ శంకర్ అధ్యక్షతన గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య,ఆరోగ్య మంత్రి విడుదల రజని, ఎంపి లావు శ్రీ కృష్ణ దేవరాయులు, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి అజయ్ జైన్, జె,ఎం,డి. శివ ప్రసాదరావులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలోని 7 నియోజక వర్గాలలో ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు – పేదలందరికీ ఇల్లు మంజూరు అయిన ఇళ్ళ స్థలాలు, నిర్మిస్తున్న ఇల్లు వాటి పురోగతి, చేపట్టిన ఇళ్ళలో పూర్తి చేసిన ఇల్లు, విడుదల చేసిన బిల్లులు, ఇంకా పూర్తి కావాల్సిన ఇల్లు పరిస్థితితో పాటు జగనన్న కాలనీలలో మౌలిక వసతుల కల్పన, లేఅవుట్లలో ఉన్న పరిస్థితిని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి నివేదిక రూపంలో అందించి, వాటి వివరాలను మంత్రి జోగి రమేష్, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి అజయ్ జైన్, జే.ఎం.డి శివ ప్రసాద్‌లకు వివరించారు. పల్నాడు జిల్లాలో ప్రజల ఆర్థిక పరిస్థితులు,పేదరికం వంటి ఇబ్బందుల వలన ఇళ్ళ నిర్మాణం ఫేజ్ 3 ద్వారా జరుగుతుందని మంత్రి తెలిపారు. జిల్లాలో మరింతగా గృహనిర్మాలకు సంబంధించి పలువురు ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరిస్తామన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, బొల్లా బ్రహ్మ నాయుడు, కాసు మహేష్ రెడ్డి, నంబూరి శంకర్రావు, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్ మెంట్ అథారటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణు గోపాలరావు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి జోగి రమేష్ ఉప్పలపాడు లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలను సందర్శించారు. అక్కడ కొత్తగా నిర్మించిన ఇంటికి గృహ ప్రవేశం చేశారు. లబ్ధిదారునికి గృహ నిర్మాణ శాఖ తరుపున ప్రభుత్వం విడుదల చేసిన చెక్కును అందజేశారు.

పేరేచర్ల లేఅవుట్‌పరిశీలన

ప్రజాశక్తి-మేడికొండూరు రూరల్

పేరేచర్లలోని వైయస్సార్ జగనన్న కాలనీ లే అవుట్లలో ఇంటి నిర్మాణాల పురోగతిని బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ పరిశీలించారు. లే అవుట్‌లో గృహ నిర్మాణాల పురోగతిపై జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మంత్రికి వివరిస్తూ తాడికొండ నియోజకవర్గంలోని గుంటూరు మున్సిపల్ పరిధిలో 414.89 ఎకరాలలో వేసిన అతి పెద్ద జగనన్న హౌసింగ్ లే అవుట్‌ను రాష్ట్రంలో రెండో అతి పెద్ద లే అవుట్ అని వివరించారు. ఇందులో 18,261 ఫ్లాట్లను వేసినట్లు అందులో 11,938 ఇళ్లను మంజూరు చేయగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 9219, నగరపాలక సంస్థ పరిధిలో (ప్రత్తిపాడు పరిధి) 1166, గుంటూరు రూరల్ మండలంలో 1253 ఇళ్లను శాంక్షన్ చేయించారు. 37 గృహాలు పూర్తి స్థాయిలో నిర్మాణాలు అయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో వున్నాయన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దష్టిలో ఉంచుకొని వేసవిలో గహ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయాలని గృహ నిర్మాణ అధికారులకు సూచించారు. తొలుత లే అవుట్ లో లబ్దిదారులు మహబూబ్ భాష (సుభాని) , రియాజ్ క్రొత్తగా నిర్మించిన ఇళ్లను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ ప్రారంభించి లబ్దిదారులచే గృహ ప్రవేశం చేయించారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి , మర్రి రాజ శేఖర్, చంద్రగిరి ఏసురత్నం , గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యేలు మద్దాలి గిరిధర రావు, గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ జైన్, ఎం.డి శివ ప్రసాద్, జిల్లా కలెక్టర్ ఏం. వేణుగోపాల్ రెడ్డి , జీయంసీ కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ లతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు.

మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

నగదు అపహరణ చేసిన బిరువా

గంగిరెడ్డిపాలెంలో చోరీ

ప్రజాశక్తి -మాచవరం

మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో పట్టపగలే చోరీ జరిగిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అచ్చాల హనుమంతరావు ఉదయం ఏడు గంటలకు రోజుమాదిరే బుధవారం పొలం పనులకు వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పొలం నుండి ఇంటికి తిరిగి వచ్చేసరికి బయట గేటు తాళం పగలగొట్టి ఉండడంతో ఆశ్చర్యంతో లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా కూడా పూర్తిస్థాయిలో పగలగొట్టి ఉంది. బీరువాలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. లాకర్లో ఉన్న రూ.లక్ష బంగారం రూ.1,30,000 నగదును చోరీ చేసినట్లు హనుమంతరావు గుర్తించారు. సంఘటన స్థలాన్ని మాచవరం ఎస్ఐ కోటయ్య సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుడు అచ్చాల హనుమంతరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు వీరంగం

ప్రజాశక్తి-తెనాలి:

మద్యం మత్తులో వీరంగం చేస్తున్న యువకుడిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. రూరల్ గ్రామం కోపల్లెకు చెందిన శశిప్రీతమ్ మంగళవారం రాత్రి బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి, హల్‌చల్ చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు ఘటనాస్థలికి వెళ్ళి నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పైప్ లైన్ ఏర్పాటు విషయంలో వివాదం

ప్రజాశక్తి-తెనాలి

పైప్ లైన్ ఏర్పాటు విషయంలో జరిగిన ఘర్షణపై రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసిన సంఘటన. రూరల్ గ్రామం కోపల్లెలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎం.విజయకుమారి కుటుంబం పైప్ లైన్ ఏర్పాటు చేసుకుంటుండగా, వారి పక్కింట్లో నివసించే విజయ్ జోక్యం చేసుకున్నాడు. ఇరువురి మధ్య మటామాటా పెరగింది. ఈ నేపథ్యంలో తనపై విజయ్ దౌర్జన్యానికి పాల్పడ్డాడని విజయకుమారి ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనం అపహరణ

ప్రజాశక్తి-తెనాలి

బైక్ అపహరణకు గురైన ఘటనపై పట్టణ ఒన్ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలోని సుల్తానాబాద్ సుందరయ్య నగర్‌కు చెందిన మల్లెల అమృతయ్య ఈనెల 2న తన బైక్‌ను మార్కెట్ ప్రాంతంలో నిలిపాడు. అక్కడి దుకాణంలోకి వెళ్ళి తిరిగి వచ్చే సరికి బైక్ కనిపించకపోవటంతో, బాదితుడు పోలీసులను ఆశ్రయించాడు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	115,059
మిర్చి ఎగుమతి	:	119,009
మిర్చి నిల్వ	:	91,234

మిర్చి ధరలు

రూపాయలలో

334	9000 - 22500
నెం.5	9000 - 19000
273	10500 - 20000
341	11500 - 24000
4884	13000 - 18000
సూపర్ -10	15000- 20700
నాన్ ఎసి	
తేజ	9000 - 23000
బడిగి	11000 - 25000
దేవనూరు డీలక్స్	11000- 20000
తాలుకాయలు	6000 - 13000

8వ వార్డులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగరి నియోజకవర్గం, టౌన్ 8వ వార్డు, 5వ సచివాలయం పరిధిలో వైసిపి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆప్కో చైర్మన్ , వైసిపి రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి పాల్గొన్నారు. కార్యక్రమంలో చిరంజీవి , పార్టీ నాయకులు కన్వీనర్‌లు గృహసారథులు ఇంటింటికి తిరుగుతూ జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాన్ని వివరిస్తూ మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఇంటి యజమానుల యొక్క అనుమతితో ప్రతి ఇంటికి, ప్రతి ఒక్క ఫోన్‌కి అంటిస్తున్నారు. జగనన్నకు ప్రజల యొక్క మద్దతు తెలపడానికి 82960 82960కి ఫోన్ చేసి ఉత్తమ మద్దతు ఇవ్వమని కోరుతున్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు జంజనం వీరాస్వామి, తిరువీధుల కోటేశ్వరరావు, చిన్నం రాజ్యలక్ష్మి, చింతిక్రింది గంగాధర్, ఉప్పు మహేష్, సంగాబత్తుని సాయికుమార్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ :ఎన్నికల వాగ్దానాలను నూటికి నూరు శాతం నెరవేర్చిన ఘనత జగన్ మోహన్ రెడ్డికి చెందుతుందని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. బుధవారం కంతేరులో మా నమ్మకం నువ్వే జగన్, గడపగడప కార్యక్రమాన్ని కొనసాగించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ వాసుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి ప్రభుత్వం హామీలు తప్ప అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జం మహేష్ , ఎంపీటీసీ వలపర్ల కల్పన, వైసీపీ నాయకులు తాళ్ల శివ నాగరాజు, మాడా శ్రీనివాసరావు, సదానంద రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్‌లను అందజేస్తున్న గంజి చిరంజీవి, తదితరులు

తనిఖీలో మాట్లాడుతున్న ఎంఆర్ఓ విజయశ్రీ

గ్యాస్ సిలిండర్‌లు సీజ్

ప్రజాశక్తి- అమరావతి

పట్టణంలో వినియోగదారులు వినియోగించే సిలిండర్లను హోటల్లో వినియోగిస్తూ మోసాలకు పాల్పడుతున్న హోటళ్లపై తహశీల్దార్ విజయ శ్రీ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు హోటల్లో దాడి చేయగా 11 సిలిండర్లు వినియోగదారుల సిలిండర్లుగా ఉండటం గమనించి వాటిని సీజ్ చేశారు. కమర్షియల్ సిలిండర్ వాడనంలో హోటల్ యాజమాన్యాలకు చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, విఆర్ఓ క్రాంతి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని నందిరాజుపాలెం పడమర వైపున ఉన్న అడవిలో దొంగమడుగు ప్రాంతంలో ప్రభుత్వం నిషేదించిన నాటుసారాయి తయారు చేస్తున్నారని సమాచారం మేరకు బెల్లంకొండ ఎస్ఐ తన సిబ్బంది తో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. సుమారు 450 లీటర్ల బెల్లం ఊటను ద్వంసం చేసి ఒక లీటర్ నాటుసారాయిను సిజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లఘించి అసాంఘీక కార్యాలకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అమీర్ తెలిపారు. నాటుసార తయారి గురించి ఏదైనా సమాచారం ఉంటే పోలీస్ వారికి తెలియజేయాలని కోరారు.

తగలబడి పోతున్న బొగ్గు లారీ

బొగ్గు లారీ దగ్ధం

ప్రజాశక్తి-రొంపిచర్ల

హైవేపై బొగ్గులోడుతో వెళుతున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి లారీ దగ్ధమైన సంఘటన మండలంలోని మర్రి చెట్టుపాలెం గ్రామం వద్ద బుధవారం చోటుచేసుకుంది. బొగ్గు లారీ నెల్లూరు నుంచి చిట్యాల వెళుతుండగా ప్రమాదం జరిగింది .షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ తెలిపాడు. ఈ సంఘటనలో ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడ్డ లారీ డ్రైవర్ వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనలో సుమారుగా రూ.70 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని లారీ డ్రైవర్ తెలిపారు.

బిజెపి పాలనలో ప్రజలపై పెరిగిన భారాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ప్రచార భేరి యాత్ర రెండవ రోజు స్థానిక శ్రీనివాస్‌కాలనీ, బోయ కాలనీ, బ్రహ్మానందరెడ్డినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేం ద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు పెరిగిపోయాయని విమర్శించారు. తొమ్మి దేళ్ల క్రితం రూ.450 ఉన్న వంటగ్యాస్ ధర నేడు రూ.1200 పెంచారని, దేశంలో నల్ల కుబేరులను కొల్లగొట్టి ప్రతి అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తానని చెప్పిన మోదీ ప్రజల అకౌంట్లలో జీరో చూపించారని విమర్శించారు. ఎపికి ప్రత్యేకహోదా ఇవ్వ కుండా, విభజన హామీలు అమలు చేయ కుండా, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయ కుండా ప్రజలను మోసం చేశారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండ పడ్డారు.

సిపిఐ పట్టణ కార్య దర్శి జయకృష్ణా నాయక్ మాట్లాడుతూ మోడీ అధికారం లోకి వచ్చాక మతవిద్వే షాలు రెచ్చగొడు తున్నారని, దళితులు, ఆది వాసుల పైనా దాడులు పెరిగాయని విమ ర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ప్రచారయాత్రలో ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయ ప్రదం చేయా లని కోరారు. ప్రచారభేరిలో సిపిఎం నాయకులు బి.వెంకటేశ్వర్లు, సం పత్ వెంకటకృష్ణ, షేక్ బాబు, సిపిఐ నాయ కులు పి.రవికుమార్, డి.సిరి పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో నిర్వహిస్తున్న ప్రచారభేరిలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ నాయకులు

యద్దపాడులో..

ప్రజాశక్తి - యద్దపాడు

కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రభుత్వ,కార్పొరేట్ అనుకూల విధా నాలను, మతోన్మాద చర్యలను నిరసిస్తూ యడ్లపాడులో ప్రచారభేరి కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా సిపిఎం,సిపిఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ , ప్రభుత్వ రంగ సంస్థల ను అదానీ, అంబానీలకు కట్టబెడు తున్న మోడీ విధానాలపై మండిపడ్డారు. పెట్రోల్ , డీజిల్ , గ్యాస్ , విద్యుత్ ధర ల పెంపు తగదని, విభజన హామీ లను అమలు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణ కోసం , వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, కనీసవేతనాల అమలు , ఉపాధి హామీ పథకం లో నిధులు పెంచి పేద లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మోడీని గద్దె దించి , దేశాన్ని కాపా డాలని, వామపక్షాలకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ప్రచారభేరి నిర్వహించారు.

నరసరావుపేటలో ప్రచారభేరిలో పాల్గొన్న సిపిఐ నాయకులు

'బిజెపిని గద్దె దించడమే లక్ష్యం'

ప్రజాశక్తి-నరసరావుపేట

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల పట్ల ప్రజలలో చైతన్యం నింపేందుకు వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 18వ వార్డులో సిపిఐ నాయకులు పర్యటించారు. కేంద్రంలోని బిజె పి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా వామపక్షాలు ఐక్యంగా పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా వార్డులలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలో 3వ సారి అధికారంలోకి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసి, రోడ్లు, రవాణా, ఓడరేవులు, స్టీల్ ప్లాంట్, బ్యాంకులను అంబానీలు, అదానీలకు కారు చౌకగా కట్టబెట్టాలని ప్రధాని మోదీ చూస్తున్నారని విమర్శించారు. దన్నారు. నూతన అటవీ చట్టం పేరుతో అడవులు ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నారని మండి పడ్డారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, హర్ష, రాజు, మల్లి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వడ్డీ రేటుతో సొసైటీకి నష్టం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

యూనియన్ బ్యాంక్ వడ్డీ రేటు వల్ల సొసైటీకి నష్టం వస్తుందని ధూళిపాళ్ల ఆంధ్రా బ్యాంకు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నలబోతు శివన్నారాయణ అన్నారు. మహా జనసభ నలబోతు శివన్నారాయణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ గతంలో. ఆంధ్రా బ్యాంక్ 7 శాతం వడ్డీ కే సొసైటీకి అప్పులు ఇచ్చేవారని, అయితే ఆంధ్రాబ్యాంక్ యూనియన్ బ్యాంకులో విలీనం తరువాత 9.25 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారని అన్నారు. 7 శాతానికే సొసైటీ రైతులకు పంట రుణాలు ఇస్తు న్నట్లు చెప్పారు. దీనివలన 2.25 శాతం వడ్డీని సొసైటీ భరించడం వల్ల నష్టం వస్తుందని వివరించారు. యూనియన్ బ్యాంక్ వడ్డీ రేటును తగ్గించమని ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేదని, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా అప్పులు తీసు కోవాలని నిర్ణయించామని వెల్ల డించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రుణాలు తీసు కునేందుకు తీర్మానం చేశారు. యూనియన్ బ్యాంక్ అధి కారులు వారం రోజులు సమయం కావాలని కోరారు.

నేటికీ అందని 'ఆసరా' డబ్బు

ప్రజాశక్తి-రెంటచింతల

వైయస్సార్ ఆసరా డబ్బు కోసం డ్వాక్రా సంఘాల మహి ళలు ఎదురుచూస్తున్నారు ఆసరా మూడో విడత సొమ్మును సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేసి నా నేటికీ క్షేత్ర స్థాయిలో మహిళలకు అందలేదు, దీంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సొమ్ము జమ చేస్తామని మండలాల్లో సమావేశాలకు పిలిచి మెగా చెక్కులను ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి ఈ నెల 4న 738 డ్వాక్రా సంఘాలకు 7 కోట్ల 67 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ నెలాఖరు నాటికి ఆసరా డబ్బు జమ అవుతుందని, ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని వెలుగు ఏపిఎం చిన్నబాబు తెలిపారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులపై యాజమాన్యాల వేధింపు తగదు

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-నరసరావుపేట

ఏడాది మొత్తం ప్రైవేట్ ఉపాధ్యాయు లతో పిల్ల లకు పాఠాలు చెప్పించడం, అడ్మిషన్ల పేరిట వారిని వేధించడం పాఠశాల యాజమాన్యాలకు తగదని ఎస్ ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కోట సాయి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయ రాజు డిమాండ్ చేశారు. స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయి, ఆంజనేయరాజు మాట్లాడుతూ ఏడాది మొత్తం వారితో పని చేయించుకొని వారికి ఇచ్చే అరకొర జీతాలను కూడా పది నెలలకే ఇస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ ,ప్రైవేటు పాఠ శాలల్లో రాబోయే విద్యా సంవత్సరానికి గత నెల నుండే యాజ మాన్యాలు ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయన్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలపై విద్యాశాఖ అధి.కారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా కార్పొరేట్,ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు అడ్మిషన్ల పేరుతో షరతులు విధిస్తు న్నారని, కొత్త అడ్మిషన్లు తీసుకురాని ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్ ఇవ్వక పోవ డం, ఆ ఉద్యోగంలో వారిని కొన సాగనియకపోవడం చేస్తు న్నారని, దీంతో, ఉపా ధ్యా యులు మానసిక ఒత్తిడికి లోన వుతున్నారని విమ ర్శించారు. విద్యార్థులకు బోధి స్తున్నప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకో కుండా కొత్త అడ్మిషన్లు తీసుకురాలేకపోయారని చెబుతూ ఉపాధ్యాయులను ఉద్యోగం నుండి తొలగించడాన్ని ఖండిస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న కోట సాయి, ఆంజనేయరాజు

విద్యాశాఖ అధికారులు ఇటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల హక్కులను యాజమాన్యం పూర్తిగా కాలరాస్తోం దని, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌక ర్యాలు కల్పిం చడంలో ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. అతి తక్కువ మంది యాజమాన్యాలు మాత్రం పిఎఫ్,ఈఎస్ఐ వంటి సౌక ర్యాలను అసలు ఉపాధ్యాయుల పేర్లకు బదులు వేరే వారి పేర్లను రికార్డుల్లో ప్రభుత్వానికి సమర్పిస్తున్నారని విమ ర్శించారు.

తిరునాళ్లలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ముప్పాళ్ళ మండలంలోని మాదలలో మహంకాళమ్మ తిరునాళ్ల బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తిరునాళ్లకు విచ్చేసిన వారికి పొట్టి వీరేశం జ్ఞాపకార్థం, పూర్వాచారం ప్రకారం వారి మనవడు మాదల మాజీ సర్పంచ్ పొట్టి సూర్యప్రకాశరావు, మంజులవాణి దంపతులు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహా యకులుగా కుసుమ, ధరణికోట విమల, పొట్టి శ్రీనివాసు, కంచర్ల నాగేశ్వరరావు , మార్పుల వెంకటరెడ్డి, కందిమళ్ల శివ,ఎం వెం కటరెడ్డి, సైదా ఖాన్,ఇందూరి సత్యనారా యణరెడ్డి,అనుముల వీరబ్రహ్మం,అనంత వెం కట్ నారాయణ,జె.సాంబయ్య పాల్గొన్నారు.

నేటి నుండి 1-9వ తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-రెంటచింతల

ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో భాగంగా సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు నేటి నుంచి నిర్వ హించనున్నట్లు ఎంఇఒ వెంకటేశ్వరరావు తెలి పారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈనెల 27 వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు,9వ తర గతి విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11:15 వరకు పరీక్షలు నిర్వ హిస్తామన్నారు ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలలు ఈ షెడ్యూల్ కచ్చితంగా పాటిం చాలని అన్నారు సమ్మేట్ అసెస్మెంట్ -2 లకు సి బి ఎ (క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్) విధానంలో నిర్వహిస్తామన్నారు ప్రశ్నా పత్రాలతో పాటు ఓఎంఆర్ సీట్లు ఇస్తా మన్నారు. మండలంలో ఒకటి నుంచి తొమ్మి దవ తరగతి వరకు 8,156 మంది బాల బాలికలు 53 పాఠశాలల్లో ఉన్నట్లు చెప్పారు.

చివరి భూములకు సాగునీరు అందేనా!

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైతులకు సాగునీటి అవసరం నిమిత్తం నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా ఈ నెల 16వ తేదీ రాత్రి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, కాల్వ చివరి భూములకు సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు 1600క్యూసెక్కులు అమరావతి మేజర్ కు 135 లింగంగుంట మేజర్ కు 38 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు 2,850 క్యూసెక్కులకు గాను 1,600 క్యూసెక్కులు, అమరావతి మేజర్‌కు 495 క్యూసెక్కులకు గాను 135 క్యూసెక్కులు, లింగంగుంట మేజర్ కెపాసిటీ 70 క్యూసె క్కులు కాగా 38 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మేజర్ కాల్వలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసినా చివరి భూములకు నీరు అందే అవకాశం లేదు. దీంతో చివరి భూముల రైతులు ఆందోళన చెందుతున్నారు.సాగర్ ఆయకట్టు కింద సుమారు లక్ష ఎకరాల విస్తీర్ణంలో రైతులు దాల్వా పంటను సాగు చేస్తున్నారు.

అమరావతి మేజర్ కాల్వ

మతోన్మాద బిజెపితో ముంచుకొస్తున్న ముప్పు

వాడవాడలా సిపిఎం, సిపిఐ ప్రచార భేరి

ఎమ్మెల రామయ్య కాలనీలో ప్రచార భేరీని ప్రారంభించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని నులకపేట ఎమ్మెల రామయ్య కాలనీలో బుధవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రచారభేరి కార్యక్రమాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వేముల దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతు పేదలకు ఇళ్లస్థలాలు, పట్టాలు ఇవ్వడానికి మాత్రం ఈ ప్రభుత్వానికి చేతుల రావడంలేదని మండిపడ్డారు. అనేక త్యాగాలతో నాయకుల లాఠీ దెబ్బలు, అక్రమ అరెస్టులతో ఇప్పటి రామయ్య కాలనీ నిర్మాణం జరిగిందని చెప్పారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసినా బిజెపిని నిలదీయడానికి, ప్రశ్నించడానికి వైసిపి, టిడిపి ముందుకు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో దొంగ చాటుగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ప్రజలపై మోపిందని విమర్శించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతు ధరలు తగ్గిస్తామని, ప్రజలకు మేలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ధరలు తగ్గిస్తారా... ఇంటికి వెళ్తారా తేల్చుకోవాలని హెచ్చరించారు. మోడీ అధికారంలోకి రాకముందుకు రూ.450 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1150కి పెరిగిందని మండిపడ్డారు. నిర్మాణ రంగం కుదేలైపోయిందన్నారు. ఆదాయాలు పూర్తిగా తగ్గిపోగా ధరలు మాత్రం పెరిగాయని చెప్పారు. 2013లో ఏర్పడిన ఎంఎల్ రామయ్య కాలనీలో మూడు ప్రభుత్వాలు మారినా ఇప్పటికీ పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. ఫారెస్టు భూములను డీఫారెస్టు చేసి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు మార్కెట్ ధరపై అదనపు ధర చెల్లిస్తామని మాట తప్పారని విమర్శించారు. మహిళలకు, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఏదో జరుగుతున్నట్లు భ్రమలు కల్పించడం తప్ప వాళ్ల జీవితాలు మెరుగుపడటానికి ఎటువంటి మార్పు జరగడంలేదని చెప్పారు. సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టుల వల్లే మంగళగిరి నియోజకవర్గంలో పేదలు వేలాది ఇళ్లు వేసుకోగలిగారని, వాటిని కూల్చే పని పాలకవర్గాలు చేపట్టాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టె కరుణాకరరావు, సిపిఐ నాయకులు పి.వెంకటయ్య, ఎం.డాంగే, కంచర్ల కాశయ్య, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసగా సిపియం, సిపిఐ సంయుక్తంగా ఈనెల 14 నుండి చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక కోబాల్డ్ పేట, అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సిపిఐ నాయకులు ఎ.రామచంద్రుడు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపియం నగర కార్యదర్శి నళినీకాంత్ తదితరులు ప్రసంగించారు. తొలుత ఉదయం సిపియం, సిపిఐ నగర కార్యదర్శులు నళినీకాంత్, మాల్యాద్రి, ఇరు పార్టీల నాయకులు కార్యకర్తలు అశోక్ నగర్, కోబాల్డ్‌పేట, దేవాపురం, లక్ష్మీపురం, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో వీధి వీధికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. బహిరంగ సభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి అరుణ్, సిపియం నాయకులు ముత్యాలరావు, బి.సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు సిపిఎం, సిపిఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర బుధవారం పట్టణంలో కొనసాగింది. యాత్రలో సిపిఎం నాయకులు ములక శివ సాంబిరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్ వలి, ఏఐవైఎఫ్, సిపిఐ నాయకులు పల్నాటి నాగరాజు, ఎన్ రాజ్యలక్ష్మి, ఎం. సాంబశివరావు పాల్గొన్నారు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ప్రజా వ్యతిరేక, మతోన్మాద బిజెపిని వ్యతిరేకించాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. బుధవారం రాత్రి ఎం టి ఎం సి పరిధిలోనీ గుండిమెడ గ్రామంలో సిపిఎం సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో నిరంకుశ మతోన్మాద బిజెపి పార్టీకి వ్యతిరేకంగా ప్రచార బేరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, నాయకులు పల్లె కృష్ణ, ఎస్‌వి రాజు, బత్తుల సంసోను పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్ : మతోన్మాద, మనువాద బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరాడాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో సిపిఎం సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో మతోన్మాద బిజెపి పార్టీకి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కష్ణ, నాయకులు అమ్మిశెట్టి రాంబాబు, తాడే కోరు కొండయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిలో ప్రచార భేరీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల రామయ్య కాలనీ వాసులు

గుంటూరు లక్ష్మీపురంలో ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

మంగళగిరిలో ప్రచారం

గుండిమెడలో ప్రచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం పెదనందిపాడు మండలం వరగానిలో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి రమేష్‌బాబు, కె వెంకట శివరావు, చుక్కా యానాదువు, చెన్నుపాటి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు కరెంటు చార్జీలు నిత్య అవసర సరుకుల ధరలు పెంచి దేశ ప్రజలను దోచుకుంటుందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌ఎస్ చెంగయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య లు మాట్లాడుతూ అన్నారు. ప్రచార భేరీ కార్యక్రమంలో 31, 32,వ వార్డులలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను ప్రజలకు అందజేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని సత్యనారాయణ, పిల్లలమర్రి నాగేశ్వరరావు, పేరు బోయిన ముక్కంటి, బాణాల దాసు, మహంకాళి ప్రకాష్, గౌహార్ జానీ, సిపిఎం నాయకులు జె వి రాఘవులు, పిల్లలమర్రి బాలకష్ణ, ఏనుగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో ప్రచారం

పెదనందిపాడులో ప్రచారం

తెనాలిలో ప్రచారం

జిల్లా వ్యాప్తంగా సీనియర్ సివిల్ జడ్జీల బదిలీ

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

రాష్ట్ర వ్యాప్తంగా పలు కోర్టుల్లో పని చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో గుంటూరు జిల్లాలో పని చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జిలు కూడా ఉన్నారు. గుంటూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.విజయ సారధిరాజును తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో ప్రస్తుతం కాకినాడ 1వ అదనపు సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వై.గోపాలకష్ణను నియమించారు. గుంటూరు 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎంవి.శేషమ్మను విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో ప్రస్తుతం నర్సీపట్నంలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న టి.లీలావతిని నియమించారు. గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా పని చేస్తున్న కె.రత్నకుమార్‌ను విశాఖపట్నం 6వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. విశాఖపట్నంలో 6వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.చంద్రమౌళీశ్వరిని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. గుంటూరు 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎ.సునీతారాణిని తిరుపతి 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో ప్రస్తుతం పర్చూరు 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.కుముదినిని నియమించారు. తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న టి.రామచంద్రుడును విజయవాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో ప్రస్తుతం పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వై.బెన్నయ్య నాయుడును నియమించారు. తెనాలి 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కె.వాణిని నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.సుధీర్‌ను నియమించారు. మంగళగిరిలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.శేషయ్యను విజయవాడ 4వ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. ఆ స్థానంలో ప్రస్తుతం విజయవాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వై.నాగరాజును నియమించారు. బదిలీ అయిన సీనియర్ సివిల్ జడ్జిలు మే 2లోగా కొత్త స్థానాల్లో భాద్యతలు తీసుకోవాలని కోరారు.

మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న ములకా శివ సాంబిరెడ్డి

ప్రజాశక్తి-తెనాలి: ప్రధాన వాణిజ్య పంటను సాగు చేస్తున్న పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పసుపుకు తెగులు ఆశించిందని దళారులు రైతులను భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. క్వింటాళ్ పసుపు కేవలం రూ.4 వేల నుంచి రూ.4500కే కొనుగోలు చేస్తున్నారని, ఫలితంగా రైతులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే దాదాపు 25 శాతం పసుపు కల్లాల్లోనే దళారులు కొనేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పసుపుకు క్వింటాళ్‌కు రూ.6850 ప్రకటించినా, ఆధరకు ఎక్కడా కొనుగోళ్ళు జరగటంలేదన్నారు. రైతులు నష్టపోతున్న విషయాన్ని ప్రభుత్వం గమనించి, మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ముద్దన సాంబశివరావు, సిఐటియూ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, ఎం.పూర్ణిమ పాల్గొన్నారు.

విస్తృతంగా మేడే జెండా ఆవిష్కరణలు

మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

ప్రజాశక్తి-గుంటూరు

రాబోయే మేడే కార్యక్రమంలో రవాణా రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పాతగుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఫెడరేషన్ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కార్మికులు తమ హక్కుల కోసం, 8 గంటల పనివిధానం కోసం పోరాడి సాధించుకున్న మేడే స్ఫూర్తితో, ప్రస్తుతం కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. 8 గంటల పనివిధానానికి, కార్మికుల హక్కులకు తూట్లు పొడుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే మేడే కార్యక్రమంలో రవాణా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, అన్ని ఆటో స్టాండ్‌ల వద్ద జెండా ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి, నగర కార్యదర్శి గండికోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ అండ్ జెసి జాయింట్ సెక్రెటరీ అప్పారావు మృతి

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి జాయింట్ సెక్రెటరీ, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ పాలక మండలి సభ్యులు, ప్రముఖ ఆడిటర్ బి.వి.అప్పారావు బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. అప్పారావు మృతికి సంతాపం తెలియజేస్తూ కళాశాలలో సంస్మరణ సభ నిర్వహించారు. సభలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అప్పారావు సేవలు మరువలేనివని అన్నారు. ఇంజినీరింగ్ కాలేజి, నాగార్జునా ఎడ్యుకేషనల్ సొసైటీలోని విద్యా సంస్థల అభివృద్ధికి అప్పారావు విశిష్ట సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల పాలక మండలి సభ్యులు, అధ్యాపకులు అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్మరణ సభలో కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ మద్దినేని జగదీష్, కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు తదితరులు అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను ఖాళీ చేయించాలి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కలెక్టర్ శివశంకర్ ఆదేశాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను నెల రోజుల లోపల ఖాళీ చేయించి సంబంధిత శాఖకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వక్ఫ్ పరిరక్షణ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల పాడు మండలం వంకాయలపాడు, సొలస గ్రామా లతో పాటు నరసరావుపేట మండలం రావిపాడులో ,వినుకొండ పట్టణంలో ఉన్న పలు వక్ఫ్ భూములను అన్యాక్రాంతం అవడం గుర్తిం చడం జరిగిందని వాటిని వెంటనే అవసరమైన చర్య లు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం.శేషిరెడ్డి, పంచాయతీ రాజ్ అధికారి రాజా నాయక్, డీఎఫ్ఓ రామచంద్రరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నర్సరీల నిర్వహణకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

నర్సరీ చట్టం పై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి జనని

నర్సరీల చట్టం ప్రకారం మిర్చి నర్సరీల నిర్వహణకు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సత్తెనపల్లి ఉద్యానవన శాఖ అధికారి సిహెచ్ జనని ఆదేశించారు. మండలంలోని వెన్నాదేవి, కంకణాలపల్లిలలో ఏర్పాటు చేసిన షేడ్ నెట్ నర్సరీలను బుధవారం ఆమె సందర్శించారు. 20 10-నర్సరీల చట్టంపై యజమానులకు అవగాహన కల్పించారు. షేడ్ నెట్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, పాత లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. షేడ్ నెట్ చుట్టూ 8 నుండి 14 అడుగుల వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్తో రక్షణ కల్పిం చాలని, డబుల్ డోర్ ఏర్పాటు చేయాలని సూచిం చారు. మిర్చి నర్సరీలకు సంబంధించిన రికార్డు నిర్వహణ, మిర్చి నారు కొనుగోలు చేసిన రైతులకు బిల్లు ఇవ్వడం తప్పనిసరని, దాటు నెంబర్ మిర్చి రకం వివరాలు బిల్లులో నమోదు చేయాలని యజమానులకు సూచించారు. నర్సరీ యజమానులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లు కాపీలను ఉద్యానవన శాఖ కార్యా లయంలో అందచేయాలని అన్నారు. కల్తీ నారు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్ప ని ఉద్యానవన శాఖ అధికారి హెచ్చరించారు.

ఇఫ్తార్ విందులో కూడా రాజకీయాలా?

జూలకంటి బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల

రంజాన్ మాసంలో ముస్లింల ప్రార్థనా కార్యక్రమాల్లో ఇఫ్తార్ విందు ఒక భాగమని, ఇందులో రాజకీయాలు చొప్పించడం విచారించదగ్గ విషయమని తెలుగుదేశం పార్టీ ఇన్ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం ఒక ప్రకటనలో మాచర్ల పట్టణానికి చెందిన ముస్లింలు జరుపుకునే ఇఫ్తార్ విందుకు తనను అతిథిగా ఆహ్వానించడం సహించలేని వైసిపి నాయకులు విందు కార్యక్రమాన్ని రద్దు చేయించడం విచారించదగిన విషయమని అన్నారు.తనను ఆహ్వానించినందువల్ల ఘర్షణలు జరుగుతాయని లేనిపోనివి సృష్టించి, పోలీసుల ద్వారా వైసిపి నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. దైవ కార్యక్రమాల్లో పాల్గొనకుండా,ఇఫ్తార్ విందులో పాల్గొనకుండా, ప్రభుత్వం తీరుపై నిరసన తెలియ జేయకుండా, ర్యాలీలు,సమావేశాలు నిర్వహించనీయకుండా ఆంక్షలు పెడుతున్నారని విమర్శించారు. ఇలాంటి దారుణమైన పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. తాను రావడం లేదని, ఇఫ్తార్ విందును ఆపవద్దని అధికారులకు తెలియజేసినప్పటికీ ఈ కార్యక్రమాన్ని ఆపివేయాలని చెప్పడం అన్యాయమన్నారు. మతపెద్దలు ఏకపక్షంగా వ్యవహరించకుండా ఉండాలని, పవిత్ర కార్యక్రమాల్లో చోటుచేసుకున్న రాజకీయ జోక్యంపై వారు ఆలోచన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి బాజి చౌదరి

పంట కాలం పూర్తయ్యే వరకు సాగునీరివ్వండి

ప్రజాశక్తి-నరసరావుపేట

ఎండిపోతున్న పంటలను కాపాడాలని టిడిపి, సిపిఎం, సిపిఐ రైతు సంఘాల పోరాటం అనంతరం కేటాయించి విడుదల చేసిన 6 టిఎంసిల నీరు ఏ మాత్రం సరిపోదని, కేటాయింపులకు సంబంధం లేకుండా పంట కాలం పూర్తయ్యే వరకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.బాజి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాజి చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పల్నాడు జిల్లాలో రైతులు దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను కనీసం పరామర్శించే తీరిక జిల్లాలో ఉన్న మంత్రులకు లేదని ఎద్దేవా చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వమని అడిగితే వారి కులం, మతం, పార్టీ చూస్తున్నారన్నారు. ఇరిగేషన్ శాఖ పై కనీస అవగాహన కూడా మంత్రి అంబటి రాంబాబుకి లేకపోవడం మన రాష్ట్ర దౌర్భాగ్యమన్నారు. పల్నాడు జిల్లాలో పంట నష్టపోయిన ప్రతి రైతుకి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి జి.జనార్ధన్ బాబు, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి మన్నన్ షరీఫ్, టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కె.కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శి కె. వీం ాఘువులు, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు తిరుమలకొండ నర సింహారావు, వి.శివ రామయ్య పాల్గొన్నారు.

కరాలపాడులో 'గడపగడపకు'

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కుల,మత బేధాలు లేకుండా పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు బుధవారం మండలంలోని కరాలపాడు గ్రామంలో మూడో రోజు గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.

'ఢిల్లీ పెద్దలు జగన్‌కు మొండి చేయి చూపారు'

ప్రజాశక్తి - వినుకొండ

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు పై. ఢిల్లీ పెద్దలు ,సీఎం జగన్మోహన్ రెడ్డికి మొండి చేయి చూపడంతో జగన్ రెడ్డి పైరవీకారుడైన విజయ్ కుమార్ స్వామిని ఆశ్రయించాడని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు ఎవరనే విషయంలో రాష్ట్ర ప్రజలంతా తాడేపల్లి వైపు చూస్తున్నారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పలుమార్లు ఢిల్లీ పెద్దలను కలుస్తూ మోకరిల్లుతున్నారని, రాష్ట్ర సమస్యలను వివరించకుండా తన బాబాయి హత్య కేసు దారి మళ్ళించేలా ప్రధాని మోడీ కాళ్లపై పడుతున్నాడని ఆరోపించారు. ఇక ఢిల్లీ పెద్దలు మొఖం చాటువేయడంతో స్వామీజీలను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. స్వామీజీని బెంగళూరు నుంచి తిరుపతి రప్పించి ఆరు గంటలపాటు ఆయనతో జగన్మోహన్ రెడ్డి లాబీ నిర్వహించారని, ఆ వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. మాచర్లలో టిడిపి ఇన్ఛార్జి జూల కంటి బ్రహ్మారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజలను అడ్డుకున్న పోలీ సుల చేష్టలు పరాకాష్టకు చేరాయని విమర్శించారు. ఇందుకు జిల్లా ఎస్పీ బాధ్యత వహించాలని అన్నారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పివి సురేష్‌బాబు. నియోజకవర్గ టిడిపి నాయకులు వి.పేరయ్య పాల్గొన్నారు.

కట్టమూరులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైవి ఆంజనేయులు

ముస్లింలను చిన్నచూపు తగదు : వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వైసిపి ప్రభుత్వం ముస్లింలను చిన్నచూపు చూస్తోందని, వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆక్రమించుకుని భయాందోళనలకు గురిచేస్తోందని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కట్టమూరులో బుధవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు , మండల పార్టీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-మాచవరం

మాచవరం మండలం జింకల పాలెం గ్రామంలోని అబుబకర్ మసీద్‌లో చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్‌ను ముస్లిం మత పెద్దలు సత్క రించారు.

ప్రాంగణ ఎంపికల్లో ఎంఎఎం ఫార్మసి కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-నరసరావుపేట:

మండలంలోని కేసనపల్లి పరిధిలోని ఎంఎఎం ఫార్మసి కళాశాలలో హైదరాబాద్ కు చెందిన మెడి అసిస్ట్ హెల్త్ సర్వీ సెస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో చివరి ఏడాది బి. ఫార్మసి, ఫార్మ్ డి, సైన్స్ బ్యాక్ గ్రౌండ్ చదువుతున్న విద్యా ర్థులు 100 మంది హాజరు కాగా 20 మందికి ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ హెచ్ ఆర్ ప్రతి నిధులు ఎ.అంజన్, ఎస్.కీర్తి, టి.లిఖిత పాల్గొని రాత పరీక్ష, బృంద చర్చలు, సాంకేతిక విభాగాలలో నిర్వహించిన ఇంట ర్వ్యూలలో ప్రతిభ చాటిన 20 మంది విద్యార్థులను ఉద్యో గాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ట్రైనింగ్ అండ్ పేస్‌మెంట్ అధికారి డాక్టర్ వి.సత్యనారాయణ తెలిపారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గ్రేస్ మహిళా మండలి చలివేంద్రం

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయ కూడలిలో బెల్లంకొండ గ్రేస్ మహిళా మండలి అధ్యక్షురాలు దుగ్గి కీర్తన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి చలివేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే నంబూరి శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కీర్తనను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక వైసిపి నాయకులు, మండల అభి వృద్ధి కమిటీ చైర్మన్ సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి, సచి వాలయం కన్వీనర్ పి.షేక్ మౌలాలి పాల్గొన్నారు.

దాతలు ముందుకొస్తే సహకరిస్తాం

ప్రజాశక్తి- విజయపురిసౌత్

కలెక్టర్ ఆదేశాల మేరకు మాచర్ల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ బత్తుల వాణి బుధవారం చలివేందద్రం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి పట్టణంలో కూడా ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే సహకరిస్తామని తెలిపారు. ఆర్ఐ ఎన్.శ్రీనివాస రావు, టైపిస్ట్ నాగవల్లి పాల్గొన్నారు.

ట్రైసైకిల్ అందజేత

ప్రజాశక్తి - యడ్లపాడు

జనసేన పార్టీ ఆధ్వర్యంలో యడ్లపాడు గ్రామానికి చెందిన వికలాంగ మహిళకు బుధవారం ట్రై సైకిల్‌ను ఆపార్టీ నాయకుడు పెంటేలా బాలాజీ అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి టి.రామాంజనేయులు, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం కమిటి కార్యదర్శి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

23న సోషల్ వెల్ఫేర్ గురుకులాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 5వ తరగతి, ఇంటర్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల నిమిత్తం ఈనెల 23వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎం ఎస్‌డబ్ల్యూఆర్‌ఇఐఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ 5వ తరగతిలో ప్రవేశానికి, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకూ ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్స్ నుండి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 5వ తరగతికి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 21 బాలయోగి గురుకుల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, సుమారు 3741 మంది హాజరవుతున్నారన్నారు. ఇంటర్‌కు సంబంధించి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొత్తం 21 అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఉంటాయని, సుమారు 3015 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ తీసుకురావాలన్నారు. పెన్సిల్, జెల్ పెన్నులు వాడకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని, హాల్‌టికెట్, ఆధార్ తప్పనిరిగా తీసుకురావాలని కోరారు. హాల్‌టిక్కెట్‌లో జెండర్, క్యాస్ట్ తప్పు పడినట్లయితే పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ని కలిసి సరి చేయించుకోవాలన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

వేసవి కాలంలో నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడానికి నారా లోకేష్ ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు దోహదపడుతున్నాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆల్ఫా హోటల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంను బుధవారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. పట్టణ, రూరల్ టీడీపీ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు, టి.పార్థసారథిలు స్థానిక నాయకులతో కలిసి చలివేంద్రంను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం. వెంకట్, టీడీపీ నాయకులు జి. పిచ్చిరెడ్డి, పి.తిరుపతయ్య, కె.అంకమ్మరావు, ఎ. భాగ్యారావు, వి.మాధవరావు, కె.అప్పారావు, ఎ.ఉమామహేశ్వరరావు, జి.రాఘవ, తదితరులు ఉన్నారు.

నర్సరీని పరిశీలిస్తున్న మండల ఉద్యానశాఖాధికారి ఆశోకరెడ్డి

నర్సరీల నిర్వహణకు లైసెన్సు తప్పనిసరి

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని బండారుపల్లిలో ఉన్న ఫిసిట్ నర్సరీ, పేరేచర్లలోని నర్సరీలను మండల ఉద్యానశాఖ అధికారి అశోక్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ యజమానులు రైతులకు నాణ్యమైన మిరప నారు అందించడానికి అనుసరించాల్సిన సూచనలను అందజేసారు. నర్సరీలలో రికార్డులను పరిశీలించి, నర్సరీ నిర్వహణలో ఉన్న లోపాలను సరి చూసుకోవాలని యజమానులకు నోటీసులను అందజశారు. ఉద్యాన శాఖ ద్వారా అనుమతి పొందిన నర్సరీలకు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. అధిక రేట్లకు నారు అమ్మరాదని ఆదేశించారు. నారు పెంచుటకు తప్పనిసరిగా, సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు.గ్రామములో ఉన్న రైతు భరోసా సిబ్బంది, నారు పెంచే సమయంలో తప్పనిసరిగా నర్సరీ యజమానులకు తగు సూచనలు ఇచ్చి నర్సరీలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో సంబంధిత గ్రామ ఉద్యాన సహాయకులు శ్రీవిద్య, నివాస్, లలిత, పాల్గొన్నారు.

మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఘర్ కం షాదీ ఖానాలో బుధవారం సాయంత్రం రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏం. వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, కే.ఎస్.లక్ష్మణరావు, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు డిప్యూటీ మేయర్ సజీలా, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ సహాయ కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసం

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్, మేయర్, ఎమ్మెల్సీ ఎమ్మెల్యే

చాలా పవిత్రమైనదని, ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఉప వాసాలతో అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రార్ధనలు చేస్తారన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ కే.చంద్ర శేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివరామి రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మోవిడి వాణి, సాయిశ్రీ, జిల్లా మైనారిటి సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ ఘని, ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సర్ధార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

ప్రజాశక్తి-తెనాలి:నిమాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి వేడుకలను పట్టణ గౌఢ సంఘం ఆధ్వరయంలో ఆ సంఘ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపి గౌఢ సంఘం ఉపాధ్యక్షులు తుళ్ళూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ సోంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌతు లచ్చన్న ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. గౌఢ సంఘం జిల్లా కార్యదర్శి గిరిగణేష్, జాయింట్ సెక్రటరీ మోర్ల శ్రీనివాస్ గౌడ్, సిహెచ్ శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, బి.సురేష్, సీహెచ్ సురేష్, ఎం.పవన్‌గౌడ్, కె.స్వాములు పాల్గొన్నారు. **టిడిపి కార్యాలయంలో...**స్థానిక కొత్తపేటలోని టిడిపి కార్యాలయంలో గౌతు లచ్చన్న వర్ధంతి నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు టి.హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత లచ్చన్న విగ్రహానికి నివాళు లర్పించారు. గౌతు లచ్చన్న సేవలను కొనియాడారు.

తెనాలిలో నివాళులర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు

కార్యక్రమంలో డాక్టర్ వి.శేషగిరిరావు, ఈ. వెంకటపూర్ణచంద్, కె.ఏడుకొండలు, కె.శ్రీనివాసరావు, బోయపాటి అరుణ, జె.మహేష్, గిరిగణేష్ పాల్గొన్నారు.**మంగళగిరి**:స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతి సందర్భంగా మంగళగిరి నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, పి.శ్రీనివాసరావు, షేక్ రియాజ్, దామెర్ల రాజు, టి.పార్ధసారథి, వి. మాధవరావు, కె.అంకమ్మరావు, జి. రాఘవ పాల్గొన్నారు.

చనిపోయిన ఉపాధ్యాయునికొచ్చిన ఉత్తర్వులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-తెనాలి

మరణించిన ఉపాధ్యాయునికి ఏకంగా పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్ క్యాంపుకు హాజరు కావాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. సాక్షాత్తూ జిల్లా విద్యాధికారి జారీ చేసిన ఉత్తర్వులో ఆ ఉపాధ్యాయుడు చనిపోయినట్లుగా కూడా పొందుపరిచి మరీ ఉత్తుర్వులివ్వటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దీనిపై పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పిర్యాదు చేశారు. వివరాలు ప్రకారం స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో పనిచేసిన మ్యాథ్స్ ఉపాధ్యాయుడు జి.నాగయ్య దాదాపు ఆరు నెలల



ప్రభుత్వం పంపించిన ఉత్తర్వులు, పాఠశాల కమిటీ చైర్మన్ స్పందనలో ఫిర్యాదు చేసిన అర్జీ

క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు ముగిసిన నేపథ్యంలో వారి పేపర్లు దిద్దే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. పేపర్లు దిద్దేందుకు హాజరు కావాల్సిందిగా జి.నాగయ్యకు కూడా జిల్లా విద్యాధికారి జి. శైలజ ఈ నెల 12న ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ గుర్తించాల్సిన అంశం ఏమిటంటే విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన ఉత్తర్వులో నాగయ్య పేరు పక్కనే బ్రాకెట్‌లో డైడ్ అని కూడా పొందు పరిచారు. అంటే చనిపోయినా సరే పేపర్లు దిద్దేందుకు మాత్రం హాజరు కావాల్సిందేనని అధికారుల భావమో ఏమో గాని, ఈ విషయం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పేరెంట్స్ కమిటీ చైర్మన్

ఈ నిర్వాకంపై, జిల్లా విధ్యాధికారి నిర్లక్ష్యంపై సంబంధిత పాఠశాల పేరెంట్స్ కమీటి చైర్మన్ ఎం.రాజు ఈనెల 17న జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పిర్యాదు చేశారు. పాఠశాల విషయంలో జిల్లా విద్యాధికారి మొదటి నుంచి అలసత్వం వహిస్తున్నారని, చనిపోయాడని ఉత్తర్వుల్లో పొందు పరిచి మరీ మూల్యాంకనానికి హాజరు కావాలని ఉత్తర్వులిచ్చిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అభ్యుదయ కవి జయరాజుతో రేపు ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

శిలా, శిల్పి, శిల్పం, మహాకావ్యం రచన ద్వారా కేవలం వారం రోజుల్లోనే కోటిన్నర ప్రజల అభిమానం గెలుచుకున్న అభ్యుదయ, తాత్విక, ప్రజాకవి జయరాజుతో ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య సమావేశ మందిరంలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు ప్రత్యూష సుబ్బారావు, నూతలపాటి అరవింద ఒక ప్రకటనలో తెలియజేశారు. వర్తమాన సమాజంలో అంతరిస్తున్న విలువలు, మానవ సంబంధాలు, ప్రకృతి పట్ల మనిషి అవలంబిస్తున్న అనైతికత వంటి అంశాల పట్ల ప్రజాకవిగా జయరాజు ముద్ర వేసుకున్నారిని చెప్పారు. సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, స్టెప్, (స్టూడెంట్, టీచర్, ఎడ్యుకేటర్స్ అండ్ పేరెంట్స్ అసోసియేషన్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు, అసంఖ్యాకంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

తాగునీటి కుళాయి ఏర్పాటు

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక పోలకంపాడు లారీల దొడ్డి ప్రాంతంలో లారీలు నిలుపుకునే స్టాండులో డ్రైవర్లు, క్లీనర్లు తాగడానికి తాగునీరు లేదని తమకు పబ్లిక్ ట్యాపు ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి వినతి అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీ సెక్రటరీ అన్నపురెడ్డి రాధాకృష్ణకుమారితో మాట్లాడి లారీల స్టాండ్‌లో పబ్లిక్ కుళాయి ఏర్పాటు చేయించారు. లారీ డ్రైవర్లు, క్లీనర్ల తరుపున బి.ప్రభుదాస్ తమ సమస్య పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కులాయి నుంచి వస్తున్న నీరు

రంజాన్ తోఫాను అందజేస్తున్న టిడిపి నాయకులు

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండలో స్థానిక ముస్లిం కుటుంబాలకు, 220 మందికి రంజాన్ తోఫాను టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో బుధవారం టిడిపి సీనియర్ నాయకులు జంగాల సాంబశివరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, గ్రామ అధ్యక్షులు కంచర్ల రంగారావు, ఫటాన్ జాని ఖాన్, ఖాసిం బాబు, మాజి ఎంపిటిసి జి.అనిత, ఎలియ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలింపు పనులు వేగవంతం

ప్రజాశక్తి-మంగళగిరి

పట్టణంలోని నిడమర్రు రైల్వే గేటు వద్ద గల డంపింగ్ యార్డ్‌ను తరలించే పనులను వేగవంతం చేసినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆ ప్రాంతాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌లో ఉన్న వ్యర్ధాలను రీసైక్లింగ్ చేసి వేరే ప్రాంతానికి తరలిస్తున్నామని, పనులను మరింత వేగంతో చేసి ఈ ప్రాంతంలో పార్కును ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, కార్పొరేషన్ ఇంజనీర్ ఎస్-ఎస్ కృష్ణారెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులుగా పద్మ, సమీర్

పి.పద్మ, ఎస్.కె.సమీర్

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్‌ఎఫ్‌ఐ గుంటూరు నగర నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.పద్మ, ఎస్.కె.సమీర్ ఎన్నికయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ నగర మహాసభ స్థానిక బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ మహాసభలో 14 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చందు సుచరిత, వంశీ, సహాయ కార్యదర్శులుగా కార్తీక్, మహేంద్ర ఎన్నికయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ విద్యా ప్రైవేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించే విధంగా ఉన్న నూతన జాతీయ విద్యావిధానంపై పోరాటాలకు విద్యార్థులు సిద్ధ: కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సుధీర్, రూపస్, సుచరిత, చందు, బాల పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గీతాంజలి విద్యార్థుల ఇంగ్లీష్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - వినుకొండ : స్థానిక కొత్తపేటలోని గీతాంజలి స్కూల్స్‌లో స్కిల్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఎక్స్‌పో-2023ను బుధవారం నిర్వహించారు. ఇంగ్లీషు భాష ప్రాధాన్యాన్ని తెలుపుతూ చిన్నారులు ప్రదర్శించిన పలు నమూనాలు అబ్బురపరిచాయి. ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఇంగ్లీష్ భాషలో ప్రావీణ్యం అవసరమన్నారు.

కళ్లముందే పుచ్చకాయగా మారిన కుందేలు

- విద్యార్థులను అబ్బురపరచిన మ్యాజిక్ షో
- ఆసక్తి, ఆశ్చర్యాల మధ్య కాంత్రికార్ డెమో

విద్యార్థుల ఎదుట మ్యాజిక్‌ను ప్రదర్శిస్తున్న క్రాంతికార్

ప్రజాశక్తి-తాడేపల్లి

వందలాది మంది విద్యార్థుల కేరింతలు, చప్పట్లు మధ్య కుంచనపల్లి అరవింద హైస్కూల్లో ప్రముఖ ఇంద్రజాలికులు క్రాంతికార్ మ్యాజిక్ డెమో కార్యక్రమం బుధవారం విజయవంతంగా జరిగింది. మండుతున్న క్లాత్ నుంచి రోజా పువ్వు తెప్పించడం, చేతిలో ఉన్న కుందేలు బొమ్మ ఉన్నట్టుండి పుచ్చకాయ బద్దగా మారిపోవడం, ఒకే రకమైన మూడు పేక ముక్కలు ముగ్గురు విద్యార్థులకు మూడు రకాలుగా కనిపించడం, ఆకుపచ్చ కాయ నుండి బ్లూ రంగు వస్త్రాన్ని తెప్పించడం తదితర 12 రకాల మ్యాజిక్‌ను చూసిన చిన్నారులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్.పద్మ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన క్రాంతికార్ లాంటి ఇంద్రజాలికులు అరవింద హైస్కూల్‌కు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. వచ్చేనెల 5-14వ తేదీల్లో జరిగే శిక్షణలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మ్యాజిక్‌కు సంబంధించి మెటీరియల్ కోసం రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా క్రాంతికార్‌కు జ్ఞాపికను అరవింద విద్యార్థులు తమ సృజనాత్మకతతో రాసిన పుస్తకాలను అందజేశారు. మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిద్వారా విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెరుగడంతోపాటు ప్రశ్నించేతత్వం అలవడుతుందని అన్నారు.

బాలోత్సవం న్యాయనిర్ణేతలకు జ్ఞాపికలు

మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో గతనెల 22వ తేదీన అరవింద హైస్కూల్లో జరిగిన ఉగాది బాలోత్సవంలో పాల్గొన్న న్యాయనిర్ణేతలకు జ్ఞాపికలను అందజేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాలోత్సవం నిర్వహణకు అవకాశం కల్పించిన హైస్కూల్ ప్రిన్సిపల్ బి.ఇంద్రాణికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరవింద హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మందారపు అనురాధ పాల్గొన్నారు.

జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో న్యాయనిర్ణేతలు

జూన్ 12 నాటికి పనులు పూర్తవ్వాలి

- ఈనెలాఖరుకు వాచ్‌మెన్‌లను నియమించండి
- మిషన్ వాత్సల్య పథకం కింద పేర్లు నమోదు చేయించండి
- పాఠశాలల్లో నాడు-నేడుపై అధికారులతో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ సమీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

పాఠశాలల్లో 'నాడు-నేడు' కింద చేపట్టి అభివృద్ధి పనులు, మరమ్మతులు, టాయిలెట్లు, కిచెన్, తాగునీటి వసతి కల్పన తదితరాలను జూన్ 12వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వర్చువల్‌గా సమీక్షించారు. పనులకు సంబంధించి ఫొటోలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, అవసరమైనచోట ట్రాన్సఫర్ ఎంట్రీ ఆర్డర్ ఉపయోగించి రా మెటీరియల్ తీసుకొని పనులు పూర్తి చేయాలని అన్నారు. విద్యుదీకరణ, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాకు సుమారు రూ.30 కోట్ల వరకూ రివాల్వింగ్ ఫండ్ విడుదలైందని, వాటిని సకాలంలో వినియోగించుకోవాలని కోరారు. సిమెంటు కొరత లేకుండా పరిశ్రమలు అధికారులతో చర్చించి సకాలంలో సిమెంటు అందేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావును ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని తరచూ పరిశీలిస్తూ ఎక్కువ మంది పిల్లలు తినేలా చూడాలన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి పాఠశాలలకు వాచ్‌మెన్‌ల నియామకాన్ని పూర్తి చేయాలని, మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న ఆయాల భర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంఇఒలకు సూచించారు. రాజకీయాలకు అతీతంగా నియామకాలు ఉండాలన్నారు. అనాథ పిల్లలు విషయంలో గార్డియన్ లేకపోవడం, ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, సరైన బ్యాంకు ఖాతాను గుర్తించకపోవడం తదితర సమస్యలను పరిశీలించి సరిచేస్తే వారి బాధ్యుల ఖాతాల్లో 'అమ్మఒడి'ని జమ చేస్తామన్నారు. 6-18 ఏళ్ల అనాథ పిల్లలైన విద్యార్థులను గుర్తించి ఈనెల 26వ తేదీ లోపల నమోదు చేయించాలని, వారికి నెలకు రూ.4 వేలు చొప్పున 'మిషన్ వాత్సల్య' పథకం కింద అందుతాయని చెప్పారు. ఐసిడిఎస్ సిబ్బంది ద్వారా పిల్లల్ని నమోదు చేయాలని, చదువు, ఆదాయ ధ్రువపత్రాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, సర్వ శిక్ష అభియాన్ అధికారి విజయకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్లను ప్రారంభిస్తున్న తులసీ రామచంద్రప్రభు

'సేవాతత్పరుడు తులసీ రామచంద్రప్రభు'

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నో సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న తులసీ రామచంద్రప్రభు సేవాతత్పరుడు అని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న వేలాది మంది రోగులకు, వారి సహాయకులకు దాహార్తిని తీర్చటానికి, ఇతర అవసరాలకు నీటి కొరత రాకుండా, సూపరింటెండెంట్ విజ్ఞప్తి మేరకు రామచంద్ర ప్రభు స్పందించి, ప్రతి రోజూ రెండు ట్యాంకర్ల తాగునీటిని అందచేసే కార్యక్రమాన్ని బుధవారం జిజిహెచ్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసీ రామచంద్రప్రభు మాట్లాడుతూ పదేళ్లుగా గుంటూరు నగర శివారు కాలనీ వాసులకు, నీటి ఎద్దడి సమస్య ఉన్న అనేక ప్రాంతాలకు 3 ట్యాంకర్ల ద్వారా నిరంతరం తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు డాక్టర్ ప్రభావతి పర్యవేక్షణలో వైద్యులు, సిబ్బంది విశేష సేవలు అందిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వై.పద్మావతి, పి.రమాదేవి, బి.మల్లిక, ఎ.హరి, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుండి జాతీయస్థాయి నాటికల పోటీలు

ప్రజాశక్తి - యడ్లపాడు

కొండవీటి కళాపరిషత్ ఆధ్వర్యంలో మండంలోని లింగారావుపాలెంలో 21, 22, 23 తేదీల్లో 24వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో భాగంగా తొలిరోజైన శుక్రవారం రాత్రి గంగోత్రి పెదకాకాని వారి 'ఆస్థికలు', రసఝరి పొన్నూరు వారి 'కాపలా', శ్రీ అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. రెండోరోజైన శనివారం చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'చీకటి పువ్వు', కళాంజలి హైదరాబాద్ వారి 'రైతేరాజు', కళానికేతన్ వీరన్నపాలెం వారి 'స్థిరాస్తి' నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. మూడోరోజైన ఆదివారం సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ హైదరాబాదడ్ వారి 'థింక్', అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'వెండి అంచులు', సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'ప్రేమతో నాన్న' నాటిక ప్రదర్శనలు ఉంటాయని, అనంతరం బహుమతి ప్రదానోత్సవం చేస్తామని తెలిపారు. తొలిరోజున ప్రారంభ సభకు సినీ రచయిత, ఎఫ్‌డిసి చైర్మన్ పోసాని కృష్ణమురళి విశిష్ట అతిథిగా హాజరవుతారని, సినీ, నాటక కళాకారులు చిట్టినేని లక్ష్మీనారాయణకు సన్మానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పరిశోధనల అభివృద్ధిపై పెట్టుబడి పెట్టండి

ప్రజాశక్తి-గుంటూరు : విద్యార్థులు పరిశోధనల అభివృద్ధిపై పెట్టుబడి పెట్టాలని చెన్నైలోని బ్రహ్మాస్త్ర ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, సీఈవో సుభాష్ పి కుప్పుసామీ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డీన్ ప్రమోషన్స్, కొలాబరేషన్స్, ఫ్యాకల్టీ అఫైర్స్ ఆఫీస్, విజ్ఞాన్ టెక్నాలజీ బిజినెస్ ఇంకుబేటర్ సంయుక్త ఆధ్వర్యంలో 'టెక్నోలాజికల్ కాంపిటీటివ్‌నెస్ ఇన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సుభాష్ పి కుప్పుసామీ మాట్లాడుతూ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్స్‌గా ఎదగాలనుకునే విద్యార్థులు ఇన్నోవేషన్, కాస్ట్ సేవింగ్స్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్, గ్లోబల్ రీచ్, న్యూ బిజినెస్ మోడల్స్, కాంపిటీటివ్ అడ్వాంటేజ్, ఫండింగ్, కొలాబరేషన్, డెసిషన్ మేకింగ్, ఫ్లెక్సిబిలిటీ, సస్టైనబిలిటీ వంటి అంశాల్లో పట్టు సాధించాలన్నారు. కొత్త ఐడియాలను వెంటనే అభివృద్ధి చేసి మార్కెట్‌లోకి విడుదల చేయాలని సూచించారు. వినియోగదారులు ఆశిస్తున్న సర్వీసులను మించి అందించడానికి ప్రయత్నిస్తేనే ఆ ప్రొడక్ట్ త్వరగా ప్రజల్లోకి వెళ్తుందన్నారు. కార్యక్రమంలో చెన్నైలోని బ్రహ్మాస్త్ర ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ సురేంద్రన్ గణేషన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.